స్త్రీ, పురుషులలోని ఎవరేని సత్కార్యములొనరించినచో, ఆమె లేక అతడు విశ్వాసిగా నుండినచో మేము నిశ్చయముగా ఒక పరిశుద్ధ జీవిత రూపము లో బ్రతికింతుము. వారు చేయు ఉత్తమ కార్యముల ప్రకారము వారికి తప్పక ప్రతిఫలమునిత్తుము.

*(అన్నహ్ల్ 16:98)*

# ఇస్లాంలో మహిళ స్థానము


**రచన**

ముహమ్మద్ జఫ్రుల్లాహ్ ఖాన్

**అనువాదము**

హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్



**ప్రచురణ**

నజారత్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్

జిల్లా: గుర్దాస్‌పూర్-పంజాబ్

# Woman in Islam

A clarification of the myth in the West about
the status of woman in Islam

English By

Muhammad Zafrullah Khan

Islam lo Mahila Sthanamu

(Telugu)

Telugu Translation By

Hafiz Syed Rasool Niyaz


First Edition : 2019

Copies : 1000

Published by : Nazarat Nashr-o-Isha'at,
Sadr Anjuman Ahmadiyya Qadian
Dist: Gurdaspur, Punjab, India, 143516

Printed at : Fazl-e-Umar Printing Press Qadian


ఇతర వివరములకు సంప్రదించగలరు

www.alislam.org

www.ahmadiyyamuslimjamaat.in

Toll Free No: 1800-103-2131

# విషయ సూచిక


| క్ర.సం | విషయములు | పుట |
|---|---|---|
| 1. | తొలిపలుకులు | V |
| 2. | ఇస్లాంలో మహిళ స్థానము | 1 |
| 3. | ఆధ్యాత్మిక సమానత్వము | 3 |
| 4. | విధుల వైవిధ్యం | 7 |
| 5. | వివాహము | 8 |
| 6. | భార్యా భర్తల విధులు, బాధ్యతలు | 11 |
| 7. | విడాకులు | 13 |
| 8. | బహుభార్యత్వం | 19 |
| 9. | తల్లి | 22 |
| 10. | మహిళ ఆర్థిక స్థాయి | 24 |
| 11. | స్త్రీ, పురుషుల భద్రత | 28 |
| 12. | హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం హదీసులు | 33 |
| 13. | గ్రంథసూచిక | 37 |

# తొలి పలుకులు

ఇప్పటికి అనేక సమాజములలో మహిళ ద్వితీయ శ్రేణి పౌరురాలిగా పరిగణించబడుతుంది. పురుషుడు అనుభవించుచున్న ఏన్నో ప్రాథమిక హక్కులు కూడ నేడు మహిళకు లభించడం లేదు. ఈ వివక్షపై తీవ్ర ఆగ్రహానికి గురై ఈ ప్రాథమిక హక్కులతో పాటు సమాన స్థానము పొందుటకు మహిళలు గొప్ప పోరాటమే చేయవలసి వచ్చింది. దురదృష్ట శాత్తు నేటి వరకు కూడ పాశ్చాత్య దేశాలలో ఆయా హక్కులు వారికి లభించడం లేదు. ఫలితముగా ఆధునిక సమాజములో తీవ్ర హెచ్చుతగ్గులు ఏర్పాటైనవి. పురుషాధిక్యము గల పాశ్చాత్య దేశములలో ఒక ముస్లిం మహిళను వెనుకబడిన మహిళగా చూడడం జరుగుతుంది.

దీనికి విరుద్ధంగా ఇంతకుముందెన్నడు లేని విధంగా ఇస్లాం ధర్మము స్త్రీకి మొదటిసారి గొప్ప స్థానము ప్రసాదించెను. స్త్రీ పురుషులు సమానమని పేర్కొనే వందలాది బోధనలు ఇస్లాం ధర్మ పవిత్ర శాసనమైన పవిత్ర ఖుర్ఆన్‌లో గలవు. ఎలాంటి లోపాలు లేకుండా సామాజికము, ఆధ్యాత్మికము, ఆర్థికంగా స్త్రీ పురుషులు సమానమని ఇస్లాం సూచించెను. పవిత్ర ఖుర్ఆన్‌లోని అనేక సూక్తులలో స్త్రీ పురుషులిద్దరిని ఉద్దేశించి వారి వారి శరీర ఆకృత్యములను బట్టి వారికి వారి బాధ్యతలు, విధుల గురించి సురక్షితంగా సమాజములో వారు నిర్వహించాల్సిన పాత్ర గురించి బోధన గలదు.

ఈ చిన్న పుస్తకములో చాలా చక్కగా ముస్లిం మహిళ హక్కులు, వారి విధుల వైవిధ్యం, వివాహము, విడాకులు, బహుభార్యత్వం, ఇస్లాంలో సామాజిక, నైతిక విలువలను తెలుపు ఇస్లాం, పవిత్ర ఖుర్ఆన్ నిజమైన బోధనలు పొందుపర్చబడెను. కొన్ని అపోహల వలన పాశ్చాత్య దేశములలో తప్పుగా భావించబడిన ఈ అంశము గురించి చక్కటి పుస్తకము రచించినందుకు గౌ॥ సర్ ముహమ్మద్ జఫ్రుల్లాహ్ ఖాన్ గారికి నేను ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

దీనిని తెలుగు భాషలో గౌ॥ హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్ ఇంచార్జి తెలుగు డెస్క్ గారు అనువదించగా గౌ॥ షేఖ్ ముహమ్మద్ ఇబ్రాహీమ్ నాసిర్, గౌ॥ అమతుల్ ఖయ్యూమ్ ముబారక గారలు పునఃపరిశీలించి, ప్రూఫ్ రీడింగ్ చేసిరి. అల్లాహ్ తఆలా వారందరికి సత్ఫలితములు నొసంగు గాక! ఆమీన్.

ఇట్లు
హాఫిజ్ మఖ్దూమ్ షరీఫ్
నాజిర్ నశ్రో ఇషాఅత్ ఖాదియాన్

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

# ఇస్లాంలో మహిళ స్థానము

స్త్రీ పురుషుల బంధమును అల్లాహ్ తఆలా ఎంతో వివేకముతో సృష్టించెను. ఇస్లాం స్త్రీకి ఉన్నతమైన గౌరవప్రదమైన గొప్ప స్థానమును కల్పించెను. సుఖశాంతులు, ఆనందము, సంతానము, ప్రగతి కొరకు కొన్ని సూత్రములు అవసరముండును.

అల్లాహ్ తఆలా ప్రాణులన్నిటిని జంటగా పుట్టించినాడని పవిత్ర ఖుర్ఆన్ గట్టిగా బోధించును. కావున స్త్రీ పురుషులిరువురిని ఒకే ప్రాణితో అతడు సృష్టించెను. అందుకే అల్లాహ్ తఆలా ఇట్లు నుడివెను.

అతడు మిమ్ములను ఒక ప్రాణముతో పుట్టించెను. తరువాత దానిలో నుండే అతడు దాని జతను సృష్టించెను. *(అజ్జుమర్ 39:7)*

మీ కొరకు అతడు మీలో నుండే జతలను సృష్టించెను. *(అష్షూరా 42:12)*

ఓ విశ్వాసులారా! మీ ప్రభువు ధర్మమును అనువర్తింపుము. అతడు మిమ్ములను ఒక ప్రాణితో సృష్టించెను. దాని నుండే జతను సృష్టించెను. వారిరువురి నుండి పురుషులను, స్త్రీలను అనేకములైన వారిని వ్యాపింపజేసెను. *(అన్నిసా 4:2)*

మిమ్ములను ఒక ప్రాణితో పుట్టించినవాడే అతడు. అతడు ఆమె వైపు ఆకర్షింపబడుటకు దాని నుండే అతని జతను సృష్టించెను అతడు. *(అల్ ఆరాఫ్ 7:190)*

మీరు తృప్తి పడుటకు వారి వైపు పోవలెనని అతడు మీ కొరకు మీలో నుండే జతలను సృష్టించినది కూడ అతని సంకేతములలోనిది. అతడు మీ మధ్య ప్రేమానుగ్రహమును పుట్టించెను. నిశ్చయముగా ఆలోచించు జాతి కొరకు దీనిలో పలు సంకేతములున్నవి.

*(అర్రూమ్ 30:22)*

అల్లాహ్ తఆలా మానవుణ్ణి కరుణించి అతనికి విభిన్న ప్రతిభ సామర్థ్యములను ప్రసాదించెను. కావున అతడు వాటిని సద్వినియోగం చేసుకోవలెను.

మీరు ఏమియును ఎరుగనప్పుడు మిమ్ములను అల్లాహ్ మీ తల్లుల కడుపులలో నుండి తీసెను. మీరు కృతజ్ఞత తెలుపుటకు అతడు మీ కొరకు చెవులు, కన్నులు, హృదయములు సృష్టించెను.

*(అన్నహ్ల్ 16:79)*

దీని భావన ఏమనగా వారు తమ శక్తి సామర్థ్యములను సమయము, సందర్భానుసారము వినియోగించుకోవలెను. తద్వారా వారి శక్తులు రెట్టింపు స్థాయిలో అభివృద్ధి చెందును. కాని వాటిని విస్మరించినచో లేదా దుర్వినియోగం చేసినచో దైవాగ్రహాణ్ణి ఆహ్వానించినట్లగును.

కొన్ని మత సంస్థలు పొరపాటుగా సంసార జీవితమునకు బదులు సన్యాసత్వమును ఒక ఆధ్యాత్మిక గొప్ప స్థాయిగా పరిగణించుచున్నాయి. కాని ఇస్లాం సన్యాసత్వమును అనుమతించక పోవడమే కాక దానిని ఖండించును. పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ తఆలా ఇట్లు బోధించెను.

వారు దురాచారముగా చేసికొనిన సన్యాసత్వమును మేము వారికి కర్తవ్యముగా చేయలేకుంటిమి. కాని అల్లాహ్ ప్రీతిని పొందుటకు వారీ పద్ధతిని అవలంభించిరి. అయినను వారు దానిని పూర్తిగా పాటించలేదు.

*(అల్ హదీద్ 57:28)*

స్త్రీ పురుషుని కంటే తక్కువ స్థాయి గల ప్రాణి అని భావించినందున ఈ సన్యాసత్వపు అభిప్రాయము ఏర్పడినది. ఎందుకనగా వారు ఆమెతో

సంబంధము కొనసాగించుటను అవమానము, సద్గుణముల పరంగా దిగజారుడుతనంగా భావించిరి. మానవుడు స్వర్గము నుండి బహిష్కరించ బడుటకు చర్చి పాద్రీలు స్త్రీనే బాధ్యురాలిగా చేసిరి. ఆమెను ప్రాణరహిత వస్తువుగా ప్రవేశపెట్టి షైతాన్ సాధనముగా పేర్కొనిరి.

ఇటువంటి అభిప్రాయమును ఇస్లాం ఖండించెను. స్త్రీకి పురుషునికి సమానంగా ఆధ్యాత్మిక స్థానము కల్పించెను. స్త్రీ పురుషులిరువురు ఒకరికి మరొకరు అవసరమని నిర్ణయించుచు పరస్పరం పరిపూర్ణతకు కారణమని సూచించెను. ఉదా॥ పవిత్ర ఖుర్ఆన్ ఇట్లు తెలిపెను.

వారు మీకు వస్త్రములు. మీరు వారికి వస్త్రములు.

*(అల్ బఖరహ్ 2:188)*

## ఆధ్యాత్మిక సమానత్వము

ఆధ్యాత్మికతలో మహిళలు పురుషులు సమానమని పవిత్ర ఖుర్ఆన్ పదే పదే చాలా గట్టిగా నొక్కి చెప్పెను. ఒక చోట ఇట్లు బోధించెను.

ముస్లిం పురుషులు, ముస్లిం స్త్రీలు, విశ్వాస పురుషులు, విశ్వాస స్త్రీలు, విధేయులైన పురుషులు, విధేయులైన స్త్రీలు, సత్య పురుషులు, సత్య స్త్రీలు, సహనమునవలంభించు పురుషులు, సహనమునవలంభించు స్త్రీలు, వినమ్రులైన పురుషులు, వినమ్రులైన స్త్రీలు, దానములు చేయు పురుషులు, దానములు చేయు స్త్రీలు, ఉపవాస నియమమును పాటించు పురుషులు, నియమమును పాటించు స్త్రీలు, తమ గుప్తాంగములను భద్రపరచుకొను పురుషులు, భద్రపరచుకొను స్త్రీలు, అల్లాహ్‌ను తరచుగా స్తుతించు పురుషులు, అల్లాహ్‌ను తరచుగా స్తుతించు స్త్రీలు, వీరందరి కొరకు అల్లాహ్ నిశ్చయముగా క్షమాపణ, గొప్ప ప్రతిఫలము సిద్ధము చేసియున్నాడు. *(అల్ అహ్‌జాబ్ 33:36)*

విశ్వాస పురుషులను విశ్వాస స్త్రీలను అల్లాహ్ క్షమించుచు

అనుగ్రహించును. అల్లాహ్ గొప్ప క్షమాగుణ ప్రపూర్ణుడు, పరమ కారుణ్యమూర్తి. *(అల్ అహ్‌జాబ్ 33:74)*

స్త్రీ, పురుషులిరువురికి సమాన రక్షణ కల్పించబడెను. అతడిట్లు తెలిపెను.

ఎవరేని విశ్వాస పురుషులను, విశ్వాస స్త్రీలను వారు చేయని నేరము కొరకు కష్టమునకు గురి చేసినచో వారు ఒక గొప్ప దోషము, స్పష్టమైన పాపపు భారము మోసినవారగుదురు. *(అల్ అహ్‌జాబ్ 33:59)*

నిశ్చయముగా విశ్వాస పురుషులను, విశ్వాస స్త్రీలను ఉపద్రవమునకు గురి చేసినవారు పశ్చత్తప్తులై క్షమాపణ కోరనిచో వారి కొరకు నరకపు శిక్ష గలదు. వారి కొరకు అగ్ని శిక్ష విధించబడి వున్నది.

(అల్ బురూజ్ 85:11)

హుదైబియా శాంతి ఒప్పందము సందర్భమున సంభవించిన సంఘటనల గురించి అల్లాహ్ తఆలా ఇట్లు నుడివెను.

అవిశ్వాసము నవలంభించి మిమ్ము గౌరవ ప్రదమైన మస్‌జిద్, బలిదానము నుండి కూడ ఆపినదే వారు. దాని బలిదానం స్థానం వరకు పోకుండ ఆపబడి వుండెను. విశ్వాస పురుషులు, విశ్వాస స్త్రీలను మీరెరుగని కారణమున మీరు వారిని తమ పాదములతో త్రొక్కి వుండినచో వారి వైపు నుండి తెలియక మీకేదేని నష్టము కలిగి వుండేది. అల్లాహ్ కోరిన వానిని తన అనుగ్రహములో ప్రవేశింపజేయవలెనని ఇట్లయ్యెను. వారు విడదీయబడి వేరై పోయి వుండినచో తప్పక మేము వారిలో అవిశ్వాసము నవలంభించిన వారికి బాధాకరమైన శిక్ష ఇచ్చి వుందుము.

*(అల్ ఫతహ్ 48:26)*

మహిళకు పురుషుని కంటే ఎక్కువ ప్రమాదాలు ఎదురయ్యే అవకాశమున్నందున మహిళకు అధిక రక్షణ కల్పించబడెను.

పతివ్రతలు, ఏమియును ఎరుగని విశ్వాస స్త్రీలపై నిందారోపణ చేయువారు నిశ్చయముగా ప్రపంచములో కూడ, పరలోకములో కూడ

శాపగ్రస్తులు. వారి కొరకు చాలా గొప్ప శిక్ష (విధించబడి) యున్నది. వారు చేయుచుండిన వాటికి వారికి విరుద్ధముగా వారి నాలుకలు, వారి చేతులు, వారి కాళ్ళుసాక్ష్యమిచ్చు దినమును జ్ఞాపకము చేసికొనుము.

*(అన్నూర్ 24:24,25)*

పరలోకములో స్త్రీ, పురుషులకు సమాన పుణ్యము లభించును.

పురుషులు గాని, స్త్రీలు గాని, విశ్వాసులై సత్కర్మలు చేయువారే స్వర్గములందు ప్రవేశింతురు. ఖర్జూర బీజ వివరమంత చిన్నపాటి అన్యాయము కూడా వారి పట్ల జరుగదు. *(అన్నిసా 4:125)*

స్త్రీ, పురుషులలో నుండి ఎవడేని సత్కార్యములొనరించినచో, ఆమె లేక అతడు విశ్వాసిగా నుండినచో మేము నిశ్చయముగా ఒక పరిశుద్ధ జీవిత రూపములో బ్రతికింతుము. వారు చేయు ఉత్తమ కార్యముల ప్రకారము వారికి తప్పక ప్రతిఫలము నిత్తుము.

*(అన్నహ్ల్ 16:98)*

ఎవడేని దుష్టత్వము చేసినచో అతనికి దానికి సమానమగు శిక్షనే ఇవ్వబడును. స్త్రీ, పురుషులలో ఎవడేని మంచి చేసినచో అతడు లేక ఆమె విశ్వాసి అయివుండును. స్వర్గములో ప్రవేశించు వారే వీరు. అందులో వారికి గణణ చేయలేనంత ఆహారము నొసంగబడును.

*(అల్ మొమిన్ 40:41)*

విశ్వాస పురుషులు, విశ్వాస స్త్రీలు, ఒకరికి నొకరు మిత్రులు, వారు మంచి మాటలను ఆదేశింతురు. చెడు మాటలతో ఆపుదురు. ప్రార్థనలు నమాజ్‌ను సలుపుదురు. దానములు జకాత్ చెల్లింతురు. అల్లాహ్ అతని ప్రవక్తకు విధేయులు. అల్లాహ్ తప్పక అనుగ్రహించు వారే వీరు. నిశ్చయముగా అల్లాహ్ శక్తిమంతుడు, వివేకవంతుడు. అల్లాహ్ విశ్వాస పురుషులతో విశ్వాస స్త్రీలతో పంట కాలువలు ప్రవహించు స్వర్గముల, సదా వుండు స్వర్గములలో చాలా పరిశుభ్రమైన గృహముల వాగ్దానము చేసియున్నాడు. వారు వాటిలో శాశ్వతముగా నుందురు. అయినను

అల్లాహ్ సంతోషము అన్నిటికంటే గొప్పది. ఇదే చాలా గొప్ప విజయము. *(అత్తౌబహ్ 9:70,71)*

విశ్వాస పురుషులను, విశ్వాస స్త్రీలను అతడు తీరములలో పంటకాలువలు ప్రవహించు స్వర్గములలో ప్రవేశింపజేయవలెనని, అతడు వారితో వారి దుష్టత్వములను దూరము చేయవలెనని ఇట్లు చేయును. వారు సదా వాటిలో నుండు వారగుదురు. అల్లాహ్ దృష్టిలో ఇదొక విజయము. *(అల్ ఫతహ్ 48:6)*

కనుక వారి ప్రభువు వారి ప్రార్థనలను స్వీకరించెను. మీలో పురుషులు గాని స్త్రీలు గాని చేసిన పనిని నేను వ్యర్థము చేయను. మీలో కొందరు కొందరితో సంబంధమున్నవారు.(ఆలె ఇమ్రాన్ 3:196)

ఓ నా దాసులారా! ఈ రోజు మీకెట్టి భయముండదు, మీరు దుఃఖపడరు. మా సూక్తులను విశ్వసించినవారు, విధేయులై యుండిన వారు. *(అజ్జుఖ్రుఫ్ 43:69,70)*

నిశ్చయముగా ఈ రోజు స్వర్గస్థులు, వివిధములైన హృదయము నాకర్షించు కార్యములలో ఆనందాన్ని ఆస్వాదించుచుందురు. వారు వారి సహచరులు ఛాయలలో కట్టెమంచాలపై దిండ్లు వేసికొని వుందురు. అందులో వారి కొరకు ఫలముండును. వారు అడిగినదంతయు వారి కొరకు వుండును. *(యాసీన్ 36:56-58)*

విశ్వాస పురుషులను, విశ్వాస స్త్రీలను నీవు చూచిన దినము వారి తేజస్సు వారికి ముందు, వారి కుడి వైపు వేగముగా నడుచుచుండును. అప్పుడు ఇట్లనబడును. తీరములలో కాలువలు ప్రవహించు స్వర్గములు మీకీ దినము శుభకరమగుగాక! వారు వాటిలో సదా కొరకు వుండు వారగుదురు. ఇదే చాలా గొప్ప విజయము. *(అల్ హదీద్ 57:13)*

విశ్వాస స్త్రీల కొరకు, విశ్వాస పురుషుల కొరకు క్షమాపణ యాచించవలెనని హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించబడిరి. *(ముహమ్మద్ 47:20)*

# విధుల వైవిధ్యం

దైవ వ్యవస్థలోని ప్రతి విషయములో ఒక వివేకముందును. ఆధ్యాత్మికతలో స్త్రీ పురుషులిరువురు నిస్సందేహంగా సమానులే. దైవ బహుమానములు, శుభములు పొందుటలో కూడ ఇద్దరు సమాన భాగస్వాములే. కాని వారి ఆచరణ పరిధులు భిన్నముగా వున్నవి. వీటికనుగుణంగా వారి శక్తి సామర్థ్యములలో కూడ వ్యత్యాసమున్నది. దీనిని పవిత్ర ఖుర్‌ఆన్ ఇట్లు వివరించెను.

అతడు ఇట్లనెను. ప్రతి దానికి పుట్టుక నొసంగి, మార్గదర్శనము చూపువాడే మా ప్రభువు. *(తాహా 20:51)*

కనుక శాశ్వతముగా అల్లాహ్ వైపు శ్రద్ధ వహించుచు తన శ్రద్ధను ధర్మము యందు కేంద్రీకరించుము. ఇది అల్లాహ్ స్వభావము. దానితోనే అతడు మానవులను పుట్టించెను. అల్లాహ్ సృష్టిలో ఎట్టి మార్పు లేదు. *(అర్రూమ్ 30:31)*

వాస్తవానికి పురుషుణ్ణి స్త్రీగా మార్చడం లేదా స్త్రీని పురుషునిగా మార్చే ప్రయత్నములన్నియు ప్రమాదకరమైనవి, వ్యర్థమైనవి. స్త్రీ, పురుషుల విధులు వైవిధ్యముగా యున్నవి. వాటిని నిర్ణీత పద్ధతిలో నిర్వహించుటలోనే అందము, ఆనందము, గౌరవము కలిగించును.

స్త్రీ పురుషులకు నొసంగబడిన వివిధ శక్తి సామర్థ్యములను గమనించినచో వారి కర్మల పరిధి విభిన్నమనే విషయము చాలా స్పష్టమగును. ఉదా॥ స్త్రీ గర్భము దాల్చే ప్రతిభ కలిగి వున్నది. కాని పురుషునిలో అలాంటి ప్రతిభ లేదు. ఇదే విధంగా పురుషుడు తన శక్తియుక్తులను బట్టి యుద్ధము చేయుటలో అధిక సమర్థుడు. కాని స్త్రీని యుద్ధములో పంపుట వినాశనానికి దారి తీయును. ఇది ఆధిక్యత లేదా చిన్నచూపు అనబడదు. ఇది స్వభావపరమైన శక్తులను వినియోగించే

సమస్యగా పరిగణించబడవలెను.

గర్భము దాల్చినప్పుడు స్త్రీ కొన్ని ఆటంకాలకు గురగును. కాని పురుషునికి అటువంటి ఆటంకాలు ఎదురు కావు. తల్లి అనే అద్వితీయ సత్కారము మహిళకు మాత్రమే సొంతం. పురుషుడు దానిని ఆశించలేడు. బాల్యములో పిల్లలను పెంచి పోషించే బాధ్యత తల్లిదే. ఈ దశలో తల్లిని పోల్చినచో తండ్రి పాత్ర ద్వితీయ స్థాయి కలిగి యుండును. అప్పుడు ఆహారము, మనశ్శాంతి కొరకు బాలుడు తండ్రి కంటే ఎక్కువ తల్లి వైపు ఆకర్షించబడును. తల్లి బాలున్ని కోపగించుకున్నప్పుడు లేదా అతణ్ణి సంస్కరించినప్పుడు బాలుడు తల్లితో అసంతృప్తి చెందడు. కాని తండ్రి శిక్షించినచో అతడు ఆగ్రహానికి లోనగును. తండ్రి – బాలుని మధ్య గల సంబంధము కంటే తల్లి – బాలుని మధ్య గల సంబంధములో అల్లాహ్ తఆలా అనురాగమును ఎక్కువ కలిగించెను.

స్త్రీ సున్నిత మనస్కురాలు. సహాయము, రక్షణ కొరకు ఆమెకు పురుషుని శక్తి అవసరముండును. స్త్రీ తనకు ఇష్టము లేని విషయములో ఒత్తిడికి లోనయ్యే అవకాశమున్నది. కాని పురుషుడు తనకు ఇష్టము లేని విషయములో ఒత్తిడికి లోనయ్యే అవాకశము లేదు.

భార్య, తల్లిగా స్త్రీ కర్మల పరిధి గృహమగును. భార్యా పిల్లల పోషణ బాధ్యత వలన పురుషుడు బయటికి పోవలసి వుండును. ఎంతో వివేకము, శుభముతో కూడిన సామాజిక వ్యవస్థ ఇరువురిలో ఒక సమన్వయమును ఏర్పరచును. దీనినే ఇస్లాం ప్రకటించును.

## వివాహము

వివాహ అసలు ఉద్ధేశము దైవ ప్రీతి అనగా కోరికలను పూర్తి చేసుకొనుట, సంతానము కొనసాగించుట అని ఇస్లాం బోధించెను. ఉదా॥ స్వచ్ఛమైన విశ్వాసి లక్షణములు ఇట్లు తెలుపబడెను. వారు

నమాజ్‌లో వినయ విధేయతలు తెలుపుతారు, వ్యర్థపు మాటల నుండి విముఖులై వుంటారు, జకాత్ చెల్లింతురు, వాగ్దానములను పూర్తి చేస్తారు, దీనికి తోడు వివాహము ద్వారా తమ పతివ్రతను రక్షించుకోవాలని కూడ గట్టిగా ఇట్లు బోధించబడెను.

వీరే వారసులగువారు. అనగా స్వర్గమునకు వారసులగువారు. వారు దానిలో సదా నివసించుచుందురు.

*(అల్ మొమినూన్ 23:11,12)*

మరో చోట ఇట్లు ఆదేశించెను.

మీ మధ్య నున్న వితంతువులకు వివాహములు చేయించుము. మీ బానిస పురుషులు, స్త్రీలు మంచి నడవడి గల వారి వివాహములు కూడ చేయించుము. వారు బీదవారైనచో అల్లాహ్ వారిని తమ అనుగ్రహముతో ధనికులుగా చేయవచ్చును.

*(అన్నూర్ 24:33)*

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి.

వివాహమాడుట నా సున్నత్. నా సున్నత్ పట్ల విముఖత వహించిన వారు మాకు సంబంధించిన వారు కాదు.[1]

పాశ్చాత్య దేశములలో పతివ్రత, పవిత్రతను సత్కార్యముగా భావించక పోవడం ఎంతో దురదృష్టకరం. నిశ్చయముగా ఇది వారి బలహీనతగా మారిపోయినది. వివాహము చేసుకోకుండానే సహజీవనం కొనసాగించుట, వ్యభిచారము ఇప్పుడు సర్వ సాధారణమై పోయినది. వివాహము చేసుకొని లేదా వివాహము చేసుకోకుండానే కామ వాంఛలు తీర్చుకొనుటయే శారీరక సంబంధముల అసలు ఉద్దేశమని భావిస్తున్నారు. స్త్రీ స్థానమును ఎంత వరకు దిగజార్చినారనగా కామ వాంఛలు తీర్చుకొనుటకు స్త్రీని కేవలం ఒక పరికరంగా భావిస్తున్నారు.

భార్యా భర్తల అనుబంధము సత్ప్రవర్తనకు చిహ్నమని ఇస్లాం బోధించెను. పవిత్ర ఖుర్ఆన్ ఇట్లు సూచించెను.

వారితో సత్ప్రవర్తనవలంభించుచు బ్రతుకుము. మీరు వారిని ఇష్టపడనిచో, మీరు ఇష్టపడని దానిలో అల్లాహ్ మేలును, మంచిని పెట్టి వుండవచ్చును.

*(అన్నిసా 4:20)*

భార్యాభర్తల శారీరక సంబంధ సదుద్దేశమును మనము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశముతో మంచిగా అర్థము చేసుకొనవచ్చును. ఇందులో మీరు సంభోగము సందర్భమున 'ఓ అల్లాహ్ మమ్ములను, నీవు ప్రసాదించిన మా సంతానమనును కూడ షైతాన్ నుండి రక్షించుమని దుఆ చేయగలరని వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించిరి. (2)

అల్లాహ్ తఆలా భార్యా భర్తలను పరస్పరం దుస్తులని పేర్కొన్నట్లు ఇంతకు ముందు ప్రస్తావించబడెను. అనగా ఒకరు మరొకరి కొరకు రక్షణ, గౌరవము, అందమునకు కారకులు. వైవాహిక జీవితములోని ఇస్లాం బోధించిన ఈ విషయములన్నియు ప్రవర్తన, ఆధ్యాత్మికపరంగా ఎంత అద్భుత స్థాయి కలిగివున్నవనగా వైవాహిక జీవితము కామం కొరకు మాత్రమే అని భావించరాదు. ఈ క్రింది సూక్తులలో బోధించిన ఉపదేశములతో ఈ విషయము స్పష్టమగును.

వారు నిన్ను స్త్రీల ఋతు కాలమును గూర్చి అడుగుదురు. నీవు ఇట్లు చెప్పుము. ఇది ప్రమాదకరము. ఋతు కాలము నందు స్త్రీలకు దూరముగా నుండుము. వారు పరిశుద్ధులైనంత వరకు వారిని చేరకుము. వారు పరిశుద్ధులైన తరువాత అల్లాహ్ ఆదేశానుసారము వారిని చేరుము. తన యందు భక్తి వున్న వారిని అల్లాహ్ నిశ్చయముగా ప్రేమించును. పరి శుద్ధముగా నుండు వారిని కూడ ప్రేమించును. మీ భార్యలు మీకు పంట పొలముల వంటి వారు. కనుక మీరు కోరిన విధముగా మీ పంటపొలములను చేరుము. మీ కొరకు మీరు సత్కార్యములు చేయుము. అల్లాహ్‌కు భయపడుము. మీరు అతనిని తప్ప సందర్శించగలరని తెలిసి

కొనుము. అతని పట్ల విధేయులైన వారికి శుభవార్తను అందజేయుము.
*(అల్ బఖరహ్ 2:223,224)*

భార్య శక్తులను వృథా చేయు లేదా సంతానము కలిగించని విధమైన సంబంధమును ఇస్లాం ప్రోత్సహించలేదు. ఎందుకనగా పవిత్రత, దైవభీతి, నిష్ఠాపరతను సదా గుర్తుంచుకోవలెను. నిష్ఠాపరత బోధించి నటువంటి పవిత్ర ఖుర్ఆన్ దుఆలలోని ఒక దుఆ ఇట్లు గలదు.

ఓ మా ప్రభువు! మా జీవిత సహచరుణుల నుండి, మా సంతానము నుండి మా కళ్ళకు చల్లదనమును ప్రసాదించుము. మమ్ములను నిష్ఠాపరులకు మార్గదర్శకులు (ఇమామ్) గా చేయుము."
*(అల్ ఫుర్ఖాన్ 2:7)*

## భార్యా భర్తల విధులు, బాధ్యతలు

ఇస్లామీయ బోధనానుసారము వివాహ బంధము ఒక సామాజిక ఒప్పందము. ఇందులో పరస్పర బాధ్యతల గురించి ఒక సంపూర్ణ ప్రణాళిక గలదు. ఇది కొనసాగుటకు ఇరువురి అంగీకారము ఒక బహిరంగ ప్రకటన ద్వారా తెలుపబడును. ఇందుకు వధువు హక్కుల రక్షణకు బాధ్యుడైన వలి (సంరక్షకుడు) అంగీకారము కూడ అనివార్యము. భర్త తన ఆదాయము మేరకు చెల్లించే మెహెర్ (శుల్కము) చెల్లించుట కూడ తప్పనిసరి. మెహెర్ అనగా వధువు తరపున తల్లిదండ్రులచే లేదా సంరక్షకుని ద్వారా వరునికి చెల్లించబడే వరకట్నమని ఎవరు భావించరాదు.

వివాహ నిషేధములను స్పష్టంగా వివరించిన తరువాత అల్లాహ్ తఆలా ఇట్లు ఆదేశించెను.

మీ హస్తగతమైన ఆస్తిలో చేరిన స్త్రీలు తప్ప, ఇతర భర్తలు గల స్త్రీలతో వివాహము మీకు నిషిద్ధము. ఇది అల్లాహ్ మీకు విధించిన పరిమితులు. మీ ఆస్తిలో చేరిన వారితో మీకు యధేచ్ఛగా వ్యవహరించు

స్వాతంత్ర్యము లేదు. సముచితమైన పద్ధతిలో వారిని వివాహమాడుట ధర్మ బద్ధము. వారి నుండి మీరు లాభము పొందినచో వారికి వారి మెహెర్ (శుల్కము) ఇచ్చి వేయుట కర్తవ్యము. పరస్పర అంగీకారములతో శుల్కములు నిర్ణయించుటలో పాపము లేదు. నిశ్చయముగా అల్లాహ్ సర్వజ్ఞుడు, వివేకవంతుడు.

*(అన్నిసా 4:25)*

భార్యాభర్తలకు పరస్పరం కొన్ని హక్కులు గలవు. కాని భర్త కుటుంబ సభ్యుల పోషకుడైనందున కుటుంబ సభ్యుల పోషణకు తగిన ఆదాయము సంపాదించుటకు భర్త బాధ్యుడు. కావున కుటుంబ వ్యవహారములో అతని అభిప్రాయము అంతిమ నిర్ణయమగును. లేనిచో సమస్యలు అదుపు తప్పి కుటుంబ పతనానికి దారి తీయవచ్చును.

స్త్రీపై కొన్ని బాధ్యతలు వున్నట్లే వారికి కొన్ని అధికారములున్నవి. అయినను పురుషునికి అధికారము ఎక్కువ. అల్లాహ్ శక్తిమంతుడు, వివేకవంతుడు.

*(అల్ బఖరహ్ 2:229)*

స్త్రీ శారీరక బలహీనత, సున్నితత్వము, ఆమెకున్నటువంటి కొన్ని ప్రమాదముల వలన పురుషుణ్ణి వారిపై పర్యవేక్షకులుగా చేయబడెను.

మనుజులలో కొందరిని, కొందరికంటే అధికులను అల్లాహ్ చేసెను. వారు తమ ఆస్తిని స్త్రీల కొరకు వినియోగింతురు. కనుక పురుషులు స్త్రీలకు సంరక్షకులుగా నుందురు. విధేయతతో ప్రవర్తించి అల్లాహ్ కాపాడుమని హెచ్చరించిన రహస్యములను కూడా కాపాడువారే ఉత్తమ స్త్రీలు.

*(అన్నిసా 4:35)*

కుటుంబ శాంతి పటాపంచలయ్యే విధంగా భార్య అవిధేయతకు పాల్పడినచో భర్త ఆమెకు నచ్చచెప్పవలెను. అతని ఉపదేశములను ఆమె పాటించని యెడల శారీరకంగా ఆమెకు దూరంగా వుండవలెను. తుది

ప్రయత్నముగా ఆమెను కొంచెం దండించవచ్చును. *(4:35)*

స్త్రీతో ఆమె భర్త అనాదరముగా ప్రవర్తించినను, ఆమెతో దుర్ వ్యవహారము చేసినను వారిరువురు ఒకరితో నొకరు సమాధానపడుటలో పాపము లేదు. సామరస్యము ఉత్తమము ప్రజలకు లోభప్రవృత్తి నొసంగ బడినది. మీరు మేలు, మంచి చేసినచో, ధర్మ బద్ధముగా ప్రవర్తించినచో నిశ్చయముగా అల్లాహ్ మీరు చేయునదంతయు బాగుగా ఎరుగును.

*(అన్నిసా 4:129)*

పరస్పరం నచ్చచెప్పిన తరువాత కూడా భార్యా భర్తల మధ్య సామరస్యము కుదరనిచో ఇరువురి తరపున ఇద్దరు మధ్యవర్తులను నియమించవలెను. అల్లాహ్ తఆలా ఇట్లు ఆదేశించెను.

వారిరువురి అనగా భార్యా భర్తల మధ్య విభేదమేర్పడునని మీకు భయము కలిగినచో భర్త కుటుంబములో నుండి ఒక న్యాయ నిర్ణేతను భార్య కుటుంబములో నుండి ఒక న్యాయ నిర్ణేతను ఏర్పాటు చేయుము. వారిరువురు సమాధాన పరచదలచినచో అల్లాహ్ వారిరువురి మధ్య సఖ్యము చేకూర్చును. నిశ్చయముగా అల్లాహ్ సర్వజ్ఞుడు. నిత్య జాగరూకుడు.

*(అన్నిసా 4:36)*

## విడాకులు

అన్ని రకాలుగా ప్రయత్నించిన తరువాత కూడ సంధి ఏర్పడనిచో సుఖశాంతుల కొరకు విడాకులే ఉత్తమమైన మార్గము. ఇస్లాం విడాకులను ప్రోత్సహించదని కూడ గుర్తుంచుకోవలెను. ధర్మబద్ధమైన విషయములలో అల్లాహ్‌కు ఇష్టము లేని అతి పెద్ద విషయము విడాకులేనని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హితబోధ చేసిరి.(3)

భర్త లేదా భార్య విడాకులను ప్రతిపాదించవచ్చును. భార్య

విడాకులు కోరినచో భార్య హక్కుల సంపూర్ణ రక్షణ కొరకు చట్టం ప్రకారము సమస్య పరిష్కరించబడును.

భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడినప్పుడు సంధికి చేయబడిన ప్రయత్నములన్నియు విఫలమైనప్పుడు భర్త తన భార్య నుండి దూరముందునని ప్రమాణము చేసినచో నాలుగు నెలల లోపు తిరిగి స్వీకరించవలెను.

తమ భార్యలతో సంబంధములు పెట్టుకోమని ప్రమాణము చేయువారి కొరకు పరమావధి నాలుగు మాసములు. వారు ఏలుకొనదలచినచో నిశ్చయముగా అల్లాహ్ క్షమాగుణ ప్రపూర్ణుడు, పరమ కారుణ్యమూర్తి. వారు విడాకులే నిర్ణయించుకున్నచో నిశ్చయముగా అల్లాహ్ సర్వ శ్రవణ సమర్థుడు, సర్వజ్ఞుడు.

*(అల్ బఖరహ్ 2:227,228)*

విడాకుల కొరకు ఒక నిర్దిష్టమైన చట్టము, ప్రణాళిక గలదు. విడాకులనే విషయమును సామాన్యమైనదిగా భావించకూడదని, ఏదో తాత్కాలిక భావోద్వేగానికి లోనై విడాకులివ్వకూడదని ఈ చట్టములు సృష్టించబడెను. తమ గురించి, సంతానమున్నచో తమ సంతానము గురించి క్షుణ్ణంగా ఆలోచించిన తరువాత మాత్రమే విడాకుల కొరకు అడుగు ముందుకు వేయవలెను. చట్టం ప్రకారము చర్యలు తీసుకొనుటలో కొంత అధిక సమయము పట్టవచ్చును. తద్వారా తిరిగి స్వీకరించే (తలాఖె బాయిన్) గడువు ముగియకముందే ఆలోచించి సంధి కుదుర్చుకొనుటకు తగిన సమయము లభించును.

విడాకులు రెండు సార్లు ప్రకటించవచ్చును. తరువాత సముచితమైన పద్ధతిలో నిలుపు కొనవచ్చును. లేక దయతో పంపివేయ వచ్చును. కాని అల్లాహ్ ఏర్పరచిన నియమములను ఆ ఇరువురు పాటించలేరని భయము కలిగినప్పుడు మీరు వారికి ఇచ్చిన దానిలో నుండి ఏమియును తిరిగి తీసుకొనుట ధర్మము కాదు. అల్లాహ్ ఏర్పరచిన

నియమములు వారిరువురు పాటించలేరని భయము కలిగినచో ఆమె సమస్య పరిష్కారము కొరకు ఇచ్చినచో ఇరువురికి పాపము లేదు. ఇవి అల్లాహ్ ఏర్పరచిన పరిమితులు. దాటువారే దుష్కృతులు.

*(అల్ బఖరహ్ 2:230)*

తొందరపడి విడాకులు తీసుకోవద్దని హెచ్చరించుచు అల్లాహ్ తఆలా ఇట్లు ఆదేశించెను.

అతడు భర్త ఆమెకు భార్యకు విడాకులు ఇచ్చినచో ఆమెను తిరిగి వివాహము చేసుకొనుటకు ధర్మము అంగీకరించదు. కాని ఆమె మరొకనిని వివాహమాడి, అతని నుండి విడాకులు పొంది, తిరిగి మొదటి భర్తతో వివాహమాడుటను ధర్మము అంగీకరించును. అల్లాహ్ ఏర్పరచిన నియమములకు కట్టుబడి వుండుటకు ఇరువురును సమర్థులై వున్నప్పుడే ఈ విధమైన వివాహము సాధ్యము. జ్ఞానమున్న వారి కొరకు అల్లాహ్ స్పష్టపరచిన పరిమితులు ఇవి.

*(అల్ బఖరహ్ 2:231)*

మీరు స్త్రీలకు విడాకులు ఇచ్చినప్పుడు వారికి విధింపబడిన నియమిత కాలావసానమున వారిని సముచితమైన పద్ధతిలో స్వీకరింపుము. లేదా సముచితమైన పద్ధతిలో పంపివేయుము. కాని వారిని కష్టపెట్టవలయునను ఉద్దేశముతో ఆపకుము. ఇట్లు చేయువాడు నిశ్చయముగా తన ఆత్మకే ద్రోహము చేసికొనును. అల్లాహ్ ఆదేశములను పరిహసింపకుము. అల్లాహ్ మీకు చేసిన ఉపకారమును, మీకు అందించిన పవిత్ర గ్రంథమును, వివేకమును జ్ఞాపకము పెట్టుకొనుము. అతని ఉపదేశములను అనుసరింపుము. అల్లాహ్‌కు భయపడుము. అల్లాహ్ అంతయు నెరుగునని తెలిసికొనుము.

*(అల్ బఖరహ్ 2:232)*

మీరు స్త్రీలకు విడాకులు ఇచ్చినప్పుడు వారు తమ నియమిత కాలము పూర్తి చేసుకొని సభ్య మార్గమున పరస్పర అంగీకారముతో

కాబోవు భర్తలను వివాహమాడినచో వారిని ఆపకుము. మీతో అల్లాహ్ యందు, ధర్మ నిర్ణయ దినమునందు విశ్వాసమున్న వానికి ఇది ఉపదేశము. ఇది మీకు అన్నిటికంటే సౌభాగ్యకరము, పరిశుద్ధము. అల్లాహ్‌కు తెలియును కాని మీకు తెలియదు.

*(అల్ బఖరహ్ 2:233)*

విడాకులు పొందిన స్త్రీలు నెలసరిగ మూడు మారులు బహిష్ఠులగు నంత వరకు వేచి యుండవలెను. వారు అల్లాహ్‌ను, ధర్మ నిర్ణయ దినము ను విశ్వసించువారిగా నున్నచో అల్లాహ్ వారి గర్భము నందు సృష్టించిన దానిని దాచుకొనుట ధర్మము కాదు. ఈ స్థితిలో వారి భర్తలు సమాధాన పడి వారిని తిరిగి తోలుకొనుట ధర్మము. స్త్రీపై కొన్ని బాధ్యతలు వున్నట్లే వారికి కొన్ని అధికారములున్నవి. అయినను పురుషునికి అధికారము ఎక్కువ. అల్లాహ్ శక్తిమంతుడు, వివేకవంతుడు.

*(అల్ బఖరహ్ 2:229)*

మొదటి విడాకులు (తలాఖె రజ్ఈ) తరువాత భార్యాభర్తలు శారీరకంగా కలిసినచో మొదటి విడాకులు రద్దు చేయబడును.

మీలో నుండి విగత జీవులైన వారి భార్యలు నాలుగు మాసములు పది దినముల వరకు వేచి వుండవలయును. ఈ నియమిత కాలము ముగిసిన తరువాత వారు ఉచితముగా భావించి ఏది చేసినను మీకు పాపము అంటదు. అల్లాహ్ మీరు చేయునదంతయును ఎరుగును.

*(అల్ బఖరహ్ 2:235)*

మీరు ఆ స్త్రీలను వివాహము చేసుకోమని సూచన చేసినను, లేక వారికి వివాహము కావలెనని అభిప్రాయము మీకు వున్నను మీరు నిందకు పాత్రులు కారు. మీరు చేయు ఆలోచనలను అల్లాహ్ ఎరుగును. వారితో రహస్యమైన ఒప్పందమును చేసికొనకుము. కేవలము సముచితమైన సలహాను సూచింపుము. నియమిత కాలము పూర్తి అగునంత వరకు వివాహమును గూర్చి నిశ్చయించకుము. మీ

హృదయములలో ఏమున్నదో అల్లాహ్ ఎరుగును. కనుక జాగ్రత్త! అల్లాహ్ క్షమాగుణ ప్రపూర్ణుడనియు, సహన శీలుడనియు ఎరుగుము.

*(అల్ బఖరహ్ 2:236)*

మీలో మరణించు వారు, భార్యలను వదిలినచో ఒక సంవత్సరము పాటు తమ భార్యలకు భృతి కల్పించు, అనగా వారిని గృహముల నుండి వెడలగొట్టని మరణ శాసనము చేయవలయును. కాని వారు తమంతట తామే వెడలిపోయి, వారు తాము కోరిన ఏ నిర్ణయము తీసుకొనిన మీకు పాపము లేదు. అల్లాహ్ శక్తిమంతుడు, వివేకమంతుడు.

*(అల్ బఖరహ్ 2:241)*

విడాకులిచ్చి స్త్రీలకు కూడ సముచితమైన లాభము చేయ వలయును. దైవ భీతి వున్న వారికి ఇది కర్తవ్యము.

*(అల్ బఖరహ్ 2:242)*

స్త్రీలను స్పృశించకపూర్వము శుల్కము నిశ్చయించక పూర్వము వారికి విడాకులిచ్చినచో మీకు పాపము కాదు. విడాకులిచ్చునప్పుడు ధనికుడు తమ స్తోమతననుసరించి, పేద వాడు తమ స్తోమతననుసరించి వారికి లాభము కలుగునట్లు సముచితమైన సామాగ్రిని వారికి అందజేయవలయును. మేలు చేయువారికి ఇది కర్తవ్యము.

*(అల్ బఖరహ్ 2:237)*

శుల్కము అనగా మెహర్‌ను నిశ్చయముగా చేసుకొని, స్పృశించక పూర్వము వారికి విడాకులిచ్చినచో ఆ శుల్కములోని సగ భాగము చెల్లించ వలసి యుండును. వారు స్త్రీలు కాని వివాహమునకు బాధ్యత వహించిన వాడు కాని క్షమించినచో ఇవ్వవలసిన పని లేదు. ఇట్లు ప్రవర్తించుట ధర్మమే అగును. పరస్పరము హితము చేసికొనుట మంచిదను మాటను మరువ రాదు. నిశ్చయముగా మీరు చేయునదంతయు అల్లాహ్ గమనించును.

*(అల్ బఖరహ్ 2:238)*

రెండేళ్ళు నిండు వరకు తల్లులు పిల్లలకు తమ స్తన్యము ఇవ్వవలయును. పిల్లలకు పాలిచ్చు కాలమును పాటించదలచిన వానికి ఇది ఉపదేశము. పురుషుడు తన శిశువునకు పాలిచ్చు స్త్రీలకు తిండి, మట్టమున్నగు అవసరములకు బాధ్యత వహించవలసియుండును. శక్తికి మించిన భారము ఏ ప్రాణముపై వేయబడదు. తల్లిని ఆమె పిల్లవానిని గురించి కష్ట పెట్టరాదు. తండ్రిని అతని పిల్లవాని గురించి కష్టపెట్టరాదు. వారసునికి కూడా ఈ ఆదేశమే వర్తించును. వారు అనగా తల్లిదండ్రులు ఇరువురు కలిసి శిశువుకు పాలు విడిపించగోరినచో మీకెట్టి పాపము లేదు. అల్లాహ్‌కు భయపడుము. మీరు చేయునదంతయు అల్లాహ్ ఎరుగునని తెలుసుకొనుము. *(అల్ బఖరహ్ 2:234)*

ఈ క్రింది సూక్తులలో విడాకులు గురించి పూర్తి వివరములు స్పష్టముగా ప్రస్తావించబడెను.

ఓ సందేశహరుడా! మీరు తమ భార్యలకు విడాకులిచ్చినచో వారికి వారి విడాకుల నిర్ణీత సమయము (ఇద్దత్) ప్రకారము విడాకులిమ్ము. నిర్ణీత సమయము (ఇద్దత్)ను గణణ చేయుము. తమ ప్రభువైన అల్లాహ్‌తో భయపడుము. వారు సిగ్గుమాలిన కార్యమునకు గురి అయినది తప్ప వారిని వారి గృహముల నుండి తీయకుము. వారు కూడ స్వయముగా వెళ్ళరాదు. ఇవి అల్లాహ్ పరిమితులు. ఎవడేని అల్లాహ్ పరిమితులను దాటినచో అతడు నిశ్చయముగా తమ ప్రాణమునకు అన్యాయము చేసినవాడు. దీని తరువాత అల్లాహ్ బహుశ ఏదేని క్రొత్త తీర్పును బహిర్గతమొనర్చునేమో నీవు ఎరుగవు. *(అత్తలాఖ్ 65:2)*

కనుక వారు నియమిత సమయమునకు చేరినప్పుడు వారిని ఉచిత పద్ధతినవలంభించి ఆపుకొనుము. లేదా ఉచిత పద్ధతిలో వేరు చేయుము. తమలో నుండి న్యాయపరులను ఇద్దరిని సాక్ష్యులుగా చేసికొనుము. అల్లాహ్ కొరకు సాక్ష్యమును స్థిరపరచుము. అల్లాహ్‌ను అంతిమ దినమును విశ్వసించు ప్రతి వానికి ఉపదేశించు విషయమిది.

అల్లాహ్‌కు భయపడువాని కొరకు అతడు ఏదేని ముక్తి మార్గమును చూపును. *(అత్తలాఖ్ 65:3)*

మీ స్త్రీలలో ముట్టుతో నిరాశపడిన వారుండినచో, మీకు సందేహమున్నచో వారి నిర్ణీత సమయము (ఇద్దత్) మూడు నెలలు. ముట్టుకాని వారిది కూడ ఇదే సమయము. గర్భవతుల నిర్ణీత సమయము ప్రసవించు వరకు వున్నది. అల్లాహ్‌కు భయపడువాని కొరకు అల్లాహ్ తన ఆదేశముతో అతనికి సౌలభ్యమును పుట్టించును.

*(అత్తలాఖ్ 65:5)*

మీరు స్వయముగా వుండు చోట మీ స్తోమత ప్రకారము వారికి నివాసమేర్పరచుము. వారిని ఇబ్బందులకు గురి చేయుటకు వారిని బాధ పెట్టకుము. వారు గర్భవతులైనచో వారు ప్రసవించు వరకు వారిపై ఖర్చు చేయుచుండుము. వారు మీ కొరకు శిశువునకు పాలిచ్చినచో వారి పారితోషికము వారికి వుండును. తమ మధ్య అనుకూల వాతావరణమును సృష్టించుము. మీరు ఒకరితో నొకరు ఇబ్బందిగా నున్నట్లు భావించినచో అతని తండ్రి కొరకు మరొకామె శిశువునకు పాలివ్వవలెను.

స్తోమతనున్న వారు స్తోమత ప్రకారము ఖర్చు చేయవలెను. ఆహారములో తగ్గుదల చేయబడినవాడు అల్లాహ్ ఇచ్చినదానిలో నుండి ఖర్చు చేయవలెను. అల్లాహ్ ఏ ప్రాణమునకు అతడు దానికిచ్చిన దాని కంటే ఎక్కువ కష్టము కలిగించడు. ప్రతి ఇబ్బంది తరువాత అల్లాహ్ తప్పక ఒక సౌలభ్యమును పుట్టించును.

*(అత్తలాఖ్ 65:7,8)*

## బహుభార్యత్వం

అల్లాహ్ తఆలా ద్వారా ఏ ధర్మములో కూడ బహుభార్యత్వము

ప్రత్యేకంగా నిషేధించబడలేదు. ఇస్లాం తప్ప మరే ధర్మము బహుభార్యత్వ సంఖ్యను పరిమితం చేయలేదు. నిస్సందేహంగా ఇస్లాం బహుభార్యత్వము నకు అనుమతినిచ్చెను. కాని నలుగురి వరకు సంఖ్యను పరిమితం చేసెను. ఇందుకు వారితో న్యాయబద్ధంగా వ్యవహరించు నిబంధన సైతం విధించెను.

న్యాయసమ్మతంగా వ్యవహరించలేమని మీకు భయముండినచో ఒక్కరినే వివాహమాడుము. *(అన్నిసా 4:4)*

ఒకరి కంటే ఎక్కువ భార్యలున్న స్థితిలో న్యాయబద్ధముగా వ్యవహరించుట అనగా వారి భరణ, మనోవర్తి ఖర్చులతో పాటు ఆప్యాయతల విషయములో సమానంగా వ్యవహరించుట అని అర్థము. సారాంశమేమనగా ఏ ఏ విషయములలో సమానత్వము పాటించవచ్చునో ఆయా విషయములలో తప్పక సమానత్వము పాటించవలెను. మానవుని అదుపులో లేని విషయములలో సమానత్వము పాటించుట అనివార్యము కాదు. ఉదా॥ ప్రేమ, అనురాగము మొదలగు విషయములలో సమానంగా వ్యవహరించుట సాధ్యము కాదనే విషయము విధితమే.

మోయలేని భారమును ఏ వ్యక్తి మీద కూడ అల్లాహ్ వేయడు.

*(అల్ బఖరహ్ 2:287)*

ఈ విషయములో మరో స్పష్టమైన వివరణ ఇట్లు గలదు.

మీరు ఎంతగా కోరినను భార్యల మధ్య న్యాయము చేయలేరు. కాని ఒకరి వైపునకే ఎక్కువ మొగ్గు చూపకూడదు. దాని వలన ఇతరుల పట్ల అనిశ్చిత పరిస్థితి ఏర్పడును. మీరు పరస్పర అవగాహనమును సాధించి ధర్మ బద్ధముగా ప్రవర్తించినచో నిశ్చయముగా అల్లాహ్ క్షమాగుణ ప్రపూర్ణుడు, పరమ కారుణ్యమూర్తి.

*(అన్నిసా 4:130)*

ఈ ఆధునిక కాలములో కొందరు ముస్లిం రచయితలు పాశ్చాత్య దేశముల ఉపకారమునకు కృతజ్ఞతలు తెలుపే అత్యుత్సాహముతో ఇట్లు

విశ్లేషించిరి. సమానముగా వ్యవహరించుట బహుభార్యతమునకు ప్రథమ నియమమని పవిత్ర ఖుర్ఆన్ సూచించెను. *(అన్నిసా 4:4).* పవిత్ర ఖుర్ఆన్ మరో చోట సమానముగా వ్యవహరించుట అసాధ్యమని పేర్కొనెను. *(అన్నిసా 4:130).* కావున బహుభార్యత్వ అనుమతి రద్దు చేయబడెను.

ఈ విధమైన విశ్లేషణ తప్పుల తడక, నిరాధారమైనదని తెలుపు చున్నాము. అన్నిసా అధ్యాయములోని 130వ సూక్తి స్వయంగా బహు భార్యత్వమును అనుమతించుచున్నది. మరో విషయమేమనగా అన్నిసా అధ్యాయములోని 130వ సూక్తిలో అనుమతించిన విషయము ఇదే అధ్యాయములోని 4వ సూక్తి ద్వారా రద్దు అయినదని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం లేదా వారి అనుచరులలో ఒక్కరైనా తెలుపలేదు. ఇటువంటి విశ్లేషణను ఇస్లాం చరిత్రలో ఏ విద్యావంతుడు ప్రోత్సహించ లేదు. ఇస్లాం బోధనానుసారము బహుభార్యత్వమనేది మానవ సమాజ ఉన్నతి, స్త్రీ పురుషుల పతివ్రత రక్షణకు అద్వితీయ కారణము, వివేకముతో కూడినదని భావించబడెను. వాస్తవానికి దీనిని సత్ప్రవర్తనలు, సత్సమాజ నిర్మాణమునకు అనివార్యమని అనవచ్చును. సత్సమాజ నిర్మాణమునకు తగిన చర్యలు కఠినంగా తీసుకోనందున సమాజములో అశ్లీలత, స్వలింగ సంపర్కం, స్త్రీలు పరస్పరం రమించుకొను వంటి దుష్ప్రవర్తనలు రాజ్యమేలుచున్నవి. అడ్డు అదుపు లేని కామము సర్వసాధారణమైనందున సత్ప్రవర్తనలు అదృశ్యమైనవి.

ఏకైక భార్య లేదా బహుభార్యత్వములో సత్ప్రవర్తనలను అన్వేషించ కుండా కోరికలను అదుపులో పెట్టుకొనుటలో అన్వేషించవలెను. ప్రవర్తనలపరంగా ఎటువంటి ఆంక్షలు లేని వలన ఒక్క భార్య వున్నను లేదా బహుభార్యలున్నను దుర్వినియోగమయ్యే అవకాశము ఎలాగైనా వుండును. అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుటయే వివాహ ముఖ్య ఉద్ధేశమని ఇంతకు ముందు కూడ తెలుపబడెను. వివేకము, క్రమ శిక్షణ, ఆచరణ ద్వారా తమ శక్తియుక్తులను సద్వినియోగం చేసుకోవాలని ఇస్లాం

బోధించును. వాటిని అనవసరంగా వృథాపరచుటను లేదా అపహాస్యానికి గురి చేయుటను ఇస్లాం ఇష్టపడదు.

ఇస్లాం ఆరంభములో ఇస్లాంను స్వీకరించుట తమ ప్రాణమును పోగొట్టుకొనుట అని భావించబడెను. మక్కాలో యుండగా చాలా మంది తమ ప్రాణాలు త్యాగము చేసిరి. ఇంకా ఇతర అనేకులు మదీనాలో, ఇతర ప్రాంతాలలో సంభవించిన యుద్ధములలో తమ ప్రాణాలు కోల్పోయిరి. స్త్రీలు సైతం తమ ప్రాణాలు సమర్పించిరి. కాని పురుషులను పోల్చినచో చాలా అల్ప సంఖ్యలో స్త్రీలు ఈ గొప్ప త్యాగమునకు పాల్పడిరి. కావున అకస్మాత్తుగా స్త్రీల సంఖ్య పురుషుల కంటే చాలా ఎక్కువయ్యెను. వితంతువుల, అనాథ బాల బాలికల పోషణ సమస్య ఎదురయ్యెను. ఇటువంటి కఠినమైన స్థితిలో సత్ప్రవర్తనల, ఆధ్యాత్మిక విలువలను రక్షించేందుకు బహుభార్యత్వం అనివార్యమని భావించబడెను. కనుక ఇది కామ వాంఛలకు మార్గము కాక ఇదొక త్యాగమనబడును.

ఇంతే కాక వ్యక్తిగత, సామాజిక, రాజకీయ, ధార్మిక అంశములను పరిగణలోకి తీసుకున్నచో బహుభార్యత్వం అనివార్యమగును. ఈ ఆధునిక యుగంలో పరిస్థితులు తారుమారైనవి. ఆఫ్రికా తప్ప మిగతా దేశములలో ఏకపతి చట్టములు రూపుదిద్దుకుంటున్నవి. కాని వ్యక్తిగత విషయములు, సత్ప్రవర్తనలపరంగా బహుభార్యత్వ అవసరమని అవగతమగుచున్నది. ఇస్లాం ఇటువంటి విషయములకు కూడ తగిన ఏర్పాట్లు చేసినది.

ముస్లిములలో బహుభార్యత్వమనేది విమర్శించదగ్గ విషయము కాదు. ఒక భార్య వలె బహుభార్యత్వమునకు కూడ గౌరవము, మర్యాద గలదు. సంతానము, భార్యలలో ఎలాంటి వ్యత్యాసము పాటించరు.

## తల్లి

ఇస్లాం తల్లికి ఒక గొప్ప స్థానము కల్పించెను. తల్లిదండ్రులు

ప్రత్యేకంగా తల్లి ఎటువంటి ప్రేమానురాగము, వినయ విధేయత, ఆప్యాయత, సేవకు అర్హురాలని పవిత్ర ఖుర్ఆన్ పదే పదే నొక్కి చెప్పెను.

తమ తల్లిదండ్రులతో మంచిగా వ్యవహరించుమని మేము మానవునికి నిర్బంధ ఉపదేశమిచ్చి యున్నాము.

*(అల్ అన్కబూత్ 29:9)*

నీవు ఇట్లనుము. మీ ప్రభువు మీకు నిషేధించినవి మీకు నేను చదివి వినుపించెదను రండు. అనగా ఏ దానిని అతనికి సమానముగా చేయకుము. మీ తల్లిదండ్రుల పట్ల వినయముగా మెలుగుము.

*(అల్ అన్ఆమ్ 6:152)*

అల్లాహ్‌ను ఆరాధింపుము. అతనితో ఏ దానిని చేర్చకుము. తల్లిదండ్రుల పట్ల మిక్కిలి దయతో ప్రవర్తింపుము.

*(అన్నిసా 4:37)*

మీరు అతనికి తప్ప మరొకడిని ఆరాధించరాదని, తల్లిదండ్రులతో మంచిగా వ్యవహరించుడని, వీరిరువురిలో ఏ ఒక్కడు, లేదా ఇద్దరూ వృద్ధాప్యములో నీ దరి చేరినచో వారిని ఏమియుననకుమని, వారిని చీదరించక, వారిని సగౌరవముగా, నమ్రతతో పలకరించుమని నీ ప్రభువు తీర్మానించి వున్నాడు.

వారిరువురి కొరకు దయతో వినయముగా వ్యవహరించుము. ఇట్లనుము. ఓ నా ప్రభువు! వీరిరువురు బాల్యములో నన్ను పోషించి నాకు విద్యా బుద్ధులు నేర్పినట్లు వీరిరువురిని అనుగ్రహించుము.

*(బనీ ఇస్రాయీల్ 17:24,25)*

మేము మానవునికి అతని తల్లిదండ్రుల విషయములో హెచ్చరించుచు ఉపదేశించితిమి. అతని తల్లి అతనిని చాలా బలహీనునిగా యున్నప్పుడు ఎత్తుకొనెను. అతని పాలు విడిపించుట రెండు సంవత్సరములలో పూర్తి అయ్యెను.

*(లుఖ్మాన్ 31:15)*

తమ తల్లిదండ్రులకు మేలు చేయవలెనని మేము మానవునిని హెచ్చరించుచు ఉపదేశించితిమి. అతని తల్లి అతనిని కష్టముతో మోసెను. కష్టముతోనే అతనికి జన్మనిచ్చెను. ఆమె గర్భము, పాలు విడిపించు కాలము ముప్పది మాసములు. అతడు తన పరిపక్వమైన వయస్సునకు చేరి నలువది సంవత్సరముల వాడు అయినప్పుడు అతడిట్లనెను. ఓ నా ప్రభువు! నాకు నా తల్లిదండ్రులకు కృతజ్ఞత తెలుపు వానిగా, నీవు రాజీ పడు సత్కార్యములొనరించు వానిగా నన్ను అనుగ్రహించుము. నా కొరకు నా సంతతిని కూడ సంస్కరించుము. నిశ్చయముగా నేను నీ వైపునకే మోకరిల్లువాడను. నిస్సందేహంగా నేను విధేయులలోని వాడను.

(అల్ అహ్‌ఖాఫ్ 46:16)

ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించిరి.

తమ భార్యాపిల్లలతో ఉత్తమ రీతితో వ్యవహరించువారే మీలో ఉత్తములు.[4]

స్వర్గము తల్లుల పాదాల చెంతన వున్నది.[5]

తన కుమార్తెలను చక్కగా పోషించుచు తమ కుమారుల కంటే వారిని అల్పముగా చూడని వాడు స్వర్గముతో నా వెంట వుండును.[6]

## మహిళ ఆర్థిక స్థాయి

మహిళకు ఆర్థిక స్వాతంత్ర్యము ప్రసాదించిన మొట్ట మొదటి ధర్మము ఇస్లాం అని గుర్తుంచుకోగలరు. వివాహిత స్థిరాస్తి కొనుగోలు చేయవచ్చునని 1882వ సంవత్సరములో మొదటి సారి చట్టము ఏర్పడిన విషయము అందరికి తెలిసినదే. అప్పటి వరకు ఒక వివాహిత తన భర్త ప్రమేయం లేకుండా స్థిరాస్థి కలిగి వుండే అధికారము లేకుండెను. ఒక అవివాహిత అమ్మాయి స్థిరాస్థి వివాహము తరువాత చట్టపరంగా భర్త ఆస్తిగా మారేది. వంద సంవత్సరములు గడిచినను ఇప్పటికి భార్య కొన్ని

విషయములలో భర్త సహాయము తీసుకొనుటలో నిస్సహాయురాలిగా వున్నది.

ఇస్లాంలో ఆరంభము నుండే స్త్రీకి ఆర్థిక స్వేచ్ఛ కల్పించబడెను. వివాహ సందర్భమున భర్త తన స్తోమతను బట్టి భార్యకు (కొంత నగదు) మెహెర్ (శుల్కము) రూపంలో చెల్లించవలసిన అవసరమున్నదని ఇంతుకు ముందు కూడ ప్రస్తావించబడెను. భర్త మృతి చెందినప్పుడు అతని చర స్థిరాస్థి నుండి చెల్లించవలసిన ఋణములలో మొదట మెహెర్ చెల్లించుట అనివార్యము. ఇంతే కాక వితంతువు తన భర్త ఆస్తిలో కూడ వారసురాలు. స్త్రీ కష్టార్జితం అయిన లేదా వారసత్వము, కానుకగా పొందిన ఆస్థికి ఆమె యజమానురాలు. భర్త ప్రమేయం లేకుండానే దానిని వినియోగించు స్వేచ్ఛ ఆమెకున్నది. స్త్రీ తన ఆస్తికి భర్తను నిర్వహకునిగా నియమించ వచ్చును. కాని ఆమె స్వయంగా నిర్వహించుకోదలచినచో లేదా పర్యవేక్షించ దలచినచో అందులో జోక్యము చేసుకునే అర్హత భర్తకు లేదు. ఒక వివాహిత తన వద్ద నున్న వనరులలో అధిక భాగము లేదా మొత్తానికి మొత్తం తన కుటుంబ ఖర్చులకు వినియోగించవచ్చును, వాస్తవానికి అధిక శాతం ఇలాగే జరుగును. కావున ఇలా చేయుటకు ఆమె బాధ్యురాలు కాదు. భార్య తన కంటే ఎంత ఎక్కువ ఆస్తిపరురాలైనను కుటుంబ ఖర్చుల పూర్తి బాధ్యత భర్తపైనే వుండును. ఈ క్రింది సంఘటనతో ఈ విషయము చాలా స్పష్టమగును.

ఒక సారి స్త్రీలు తమ వనరులను బట్టి దానములు చేయాలని ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించిరి. జైనబ్ నామము గల ఇద్దరు స్త్రీలు ఆంట్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లు వేడుకొనిరి. వీరిలో ఒకరు సుప్రసిద్ధ అనుచరులు అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ సతీమణి కూడ వుండిరి. ఓ అల్లాహ్ ప్రవక్త! మా భర్తలకు ఎక్కువ ఆదాయ వనరులు లేవు. కాని మా ఆర్థిక స్థితి మెరుగ్గా వున్నది. మా వసతుల నుండి మా భర్తలకు ఆర్థిక సహాయము చేసినచో మాకు పుణ్యము

లభించునా? ఆం(హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు బదులిచ్చిరి. మీ భర్తలకు ఆర్థిక సహాయము చేసినచో మీకు రెండింతలు పుణ్యము లభించును. ఎందుకనగా ఇది ఉపకారమగును, రెండవది వారు మీ సమీప బంధువులు.

పవిత్ర ఖుర్ఆన్ ఇట్లు హెచ్చరించెను.

అల్లాహ్ మీలో కొందరికి కొందరిపై ఆధిక్యత నొసంగెను. దానిని ఆశించకుము. పురుషుల సంపాదనలో వారికి భాగమున్నది. స్త్రీల సంపాదనలో వారికి భాగమున్నది. అనుగ్రహము ప్రసాదించుమని అల్లాహ్‌ను కోరుము. సర్వ విషయముల గూర్చిన పరిజ్ఞానము నిశ్చయముగా అల్లాహ్‌కు సంపూర్ణముగా నున్నది.

*(అన్నిసా 4:33)*

మేము ప్రతి ఒక్కనికి వాని తల్లిదండ్రులు, బంధువులు వదిలి పోయిన ఆస్తికి వారసులను నిర్ణయించి వున్నాము. మీరు ప్రమాణ పూర్వకముగా ఒప్పందములు చేసికొనిన వారికి కూడ వారి భాగము ఇచ్చివేయుము. నిశ్చయముగా అల్లాహ్ అన్నిటిని పర్యవేక్షించును.

*(అన్నిసా 4:34)*

ఆస్తిని అధికముగా పంచిపెట్టుటయే అన్నిసా అధ్యాయములోని 12,13,117వ సూక్తిలో వివరించిన ఇస్లామీయ వారసత్వ ఉద్ధేశము. ఒక పురుషుడు లేదా స్త్రీ మృతి చెందినచో అతడు లేదా ఆమె కొంత ఆస్తిని వీడినచో అందులో తల్లిదండ్రులు, భర్త లేదా భార్య, కుమారులు, కుమార్తెలు అందరు వారసులే. దీని గురించి గల నిబంధన ప్రకారము స్త్రీకి ఒక భాగము పురుషునికి రెండు భాగములు లభించును. కాని ఈ నిబంధన వలన స్త్రీకి ఎలాంటి నష్టము లేదు. ఎందుకనగా కుటుంబ ఖర్చుల భారము పురుషునిపై యుండును. స్త్రీకి ఇలాంటి బాధ్యత ఏమియును లేదు. కావున ఈ నిబంధన వలన స్త్రీకే అధిక లాభము కలుగును.

తన ఆస్తిలోని మూడవ వంతు కంటే ఎక్కువ శాతమును ఇతరుల పేరిట వ్రాసిచ్చుట ఒక ముస్లింకు తగదు. దానము చేయదలచినను లేదా వారసుడు కాని వారికి ఇవ్వదలచినను మూడవ వంతు కంటే ఎక్కువ ఇచ్చు అనుమతి లేదు. ఒక వారసుని భాగమును వాంగ్మూలము ద్వారా పెంచుటకు గాని తగ్గించుటకు గాని అతనికి అనుమతి లేదు. ఇస్లామీయ వారసత్వ చట్టములో ఏ ఒక్కరికి కూడ అన్యాయము జరగలేదు. ఉదా॥ స్త్రీల వారసత్వ హక్కు ఉల్లఘించరాదని స్పష్టమైన ఆదేశమున్నది.

సమాజములో వ్యాపారములో లావాదేవీలు జరుపుకుంటున్న సమయములో ఇవ్వవలసిన సాక్ష్యము గురించి గల మార్గదర్శనమును ఇచట వివరించుట అనివార్యమని భావించుచున్నాము. ఎందుకనగా కొందరు ఈ విషయమును స్త్రీల హక్కుల ఉల్లంఘనగా పేర్కొందురు. ఆ మార్గదర్శనము ఇట్లు గలదు.

మీలో ఇద్దరు పురుషులను సాక్షులుగా నియమించుకొనుము. ఇద్దరు పురుషులు దొరకని పక్షమున ఒక పురుషుడు ఇద్దరు స్త్రీలు సాక్షులుగా మీరు ఇష్టపడిన వారిని తీసుకొనవలయును. ఎందుకనగా ఆ ఇద్దరు స్త్రీలలో ఎవరికైనను మరుపు తట్టినచో జ్ఞాపకము చేయుటకు మరొకరు అవసరము.

*(అల్ బఖరహ్ 2:283)*

ఇచట వ్యత్యాసమునకు ఏమాత్రం అవకాశము లేదు. న్యాయస్థానములలో సాక్షులుగా స్త్రీలు ప్రవేశపెట్టకుండా జాగ్రత్త పడుటకే ఈ నిబంధన విధించబడెను. అందుకే లావాదేవీల విషయములో ధృవీకరణ పత్రములపై సంతకము చేయుటకు స్త్రీని పిలవకూడదు. కాని అత్యవసర పరిస్థితులలో ఇందులో సడలింపునకు అవకాశమున్నది. సమాజములో పురుషులు తరచుగా పరస్పరం కలుసుకుంటారు. అందుకే వారిని సాక్షులుగా నియమించినచో వారు పదే పదే గుర్తు చేసుకుంటారు. కావున వారికి లావాదేవీల గురించి విషయములు సులభంగా గుర్తుండును.

కాని ఇస్లామీయ సమాజములో ఒక పురుషుడు ఒక స్త్రీ సాక్షులుగా వున్నచో లావాదేవీల గురించి వారు గుర్తు చేసుకొనుటకు పదే పదే కలుసుకునే అవకాశము చాలా తక్కువ వుండును. గుర్తు చేసుకొనుటకు తరచుగా అవకాశము లభించాలనే ఉద్దేశముతోనే ఒక పురుషుడు సాక్షిగా వున్న చోట ఇద్దరు స్త్రీలను సాక్షులుగా నియమించాలనే ఆదేశము గలదు. తద్వారా ఆ ఇద్దరు స్త్రీలు పరస్పరం అసలు విషయమును గుర్తు చేసుకోగలరని ఈ సూక్తిలో చాలా స్పష్టంగా ఆదేశించబడెను.

ఈ మార్గదర్శకాలు సాక్ష్యమును రక్షించుకొనుటకు ఉపయోగ పడును. సాక్షులు పురుషులైనను లేదా స్త్రీలు అయినను వారి తరపున ఇవ్వబడే సాక్ష్యములో ఎలాంటి భేదముండదు. ఒక ఉదాహరణతో ఈ విషయమును మనము మంచిగా అర్థము చేసుకోవచ్చును. ఒక ధృవకీరణ పత్రము గురించి ఒక పురుషుడు ఇద్దరు స్త్రీలు సాక్షురాలుగా వున్న వివాదము న్యాయమూర్తి (ఖాజి) దగ్గరికి వచ్చినట్లు భావించండి. తరువాత ఇద్దరు స్త్రీలలో ఒకరు మృతిచెందినట్లు తెలిసినది. పురుషుడైన సాక్షితో, స్త్రీ సాక్షురాలితో సాక్ష్యము న్యాయస్థానములో తీసుకోబడెను. లావాదేవీల గురించి ఆ ఇద్దరు ఇచ్చిన సాక్ష్యములు ఒకే విధంగా లేనట్లు ఖాజి గమనించెను. పరిస్థితులన్నిటిని లోతుగా పరిశీలించగా పురుషుని సాక్ష్యము కంటే స్త్రీ సాక్ష్యము నమ్మదగ్గదిగా వున్నట్లు ఖాజి భావించినచో ఆ ఖాజీ స్త్రీ సాక్ష్యమునకు పురుషుని సాక్ష్యము కంటే అధిక ప్రాధాన్యతనివ్వవలెను. ఇచట స్త్రీ పట్ల వ్యత్యాసము ప్రదర్శించుటకు ఎలాంటి ఆస్కారము లేనే లేదు.

## స్త్రీ, పురుషుల భద్రత

స్త్రీ, పురుషులు పరస్పరం దైవానుగ్రహములు. కావున ఈ బంధమును మనశ్శాంతి, దైవ ప్రీతిని పొందుటకు ఒక కారణముగా

భావించి దీనిని గౌరవించవలెను. స్త్రీ పురుషుల బలహీనతలు, శక్తి యుక్తుల గురించి వారిని పుట్టించిన వానికే ఎక్కువ తెలుసు. సృష్టికర్త అయిన అల్లాహ్ తఆలా వారిరువురికి తమ లోపాలను కప్పిపుచ్చుటకు, తమ శక్తి సామర్థ్యములను ప్రగతిపథంలో నడిపించుకొనుటకు తగిన సూచనలు ఇచ్చెను. పాపములు లేదా అశాంతికి మూల కారణం ఆయా శక్తి సామర్థ్యములను దుర్వినియోగపరచడమే. ఈ మార్గదర్శకాలను గట్టిగా పాటించినచో జీవితము సుఖ శాంతులతో గడిచిపోవును. పవిత్ర ఖుర్ఆన్ ఇట్లు మార్గదర్శనము చేసెను.

నిశ్చయముగా మేము మానవునిని పుట్టించితిమి. అతని వాంఛలు అతనిని ఎటువంటి అనుమానములలో పడవేయునో మేమెరుగుదుము.

*(ఖాఫ్ 50:17)*

నిశ్చయముగా మేము మానవునిని ఒక మిశ్రమ శుక్ల బిందువుతో పుట్టించితిమి. మేమతనికి వివిధ రూపములిత్తుము. తరువాత మేమతనిని వినువానిగా, చూచేవానిగా చేసితిమి.

నిశ్చయముగా మేమతనికి సత్పథము వైపు మార్గదర్శనము చేసితిమి. కోరినచో అతడు కృతజ్ఞునిగా, కోరినచో అతడు కృతఘ్నునిగా వ్యవహరించవలెనని.

*(అద్దహ్‌ర్ 76:3,4)*

చెవులు, కన్నులు మొదలగు వాటి ద్వారా మానవుని మెదడు సూచనలను అందుకొనును. అవి పుణ్యము లేదా పాపము వైపు ఆకర్షించును. అందుకే మానవునిని ఇట్లు హెచ్చరించెను.

నీకు తెలియని దానిని అనుసరించకుము. నిశ్చయముగా చెవి, కన్ను హృదయములలో నుండి ప్రతి దానిని గూర్చి ప్రశ్నింపబడును.

*(బనీ ఇస్రాయీల్ 17:37)*

కావున ఈ అవయవములను అదుపులో పెట్టుకొంటూ జాగ్రత్తగా వుండుటయే నిజమైన నిష్ఠాపరతకు స్ఫూర్తి. అల్లాహ్ తఆలా ఆంహజ్రత్

సల్లల్లాహు అలైహి వసల్లంను ఇట్లు ఆదేశించెను.

తమ దృష్టిని క్రిందికి పెట్టమని, తమ గుప్తాంగములను కాపాడవలెనని విశ్వాసులకు చెప్పి వేయుము. వారి కొరకు ఈ విషయము చాలా పవిత్రతకు కారణమగును. వారు చేయునదంతయు అల్లాహ్ నిశ్చయముగా సదా ఎరుగును.

*(అన్నూర్ 24:31)*

విశ్వాస స్త్రీలతో ఇట్లనుము. తమ దృష్టిని క్రిందికి పెట్టుకొనుము. తమ గుప్తాంగములను కాపాడుకొనుము. తన అలంకరణను, స్వయముగా వ్యక్తమగునది తప్ప వ్యక్తపరచకుము. తమ మెడలలో పరకిణులు వేసికొనుము. తన అలంకరణను, తమ భర్తల కొరకు గాని, తమ తండ్రులకు గాని, తమ భర్తల తండ్రులకు గాని, తమ కుమారులకు గాని, తమ భర్తల కుమారులకు గాని, తమ సోదరులు గాని, తమ సోదరుల కుమారులు గాని, తమ సోదరీల కుమారులు గాని, తమ స్త్రీలు గాని, తన అధీనములో నున్న శారీరక అవసరము లేని సేవకులు గాని, స్త్రీల గుప్తాంగముల జ్ఞానము లేని బాలురు గాని, వీరికి తప్ప వ్యక్త పరచకుము. వారు అనగా స్త్రీలు తమ అలంకరణలో నుండి దాచి పెట్టునది బహిర్గత మగునట్లు తమ పాదములు భూమిపై మోపరాదు. ఓ విశ్వాసులారా! మీరు విజయులగుటకు మీరందరికందరు అల్లాహ్ వైపు క్షమాపణ కోరుచు మోకరిల్లుము.

*(అన్నూర్ 24:32)*

ఓ విశ్వాసులారా! మీ అధీనములో నున్న వారు, మీలో ఇంకను యవ్వన దశకు చేరని వారు మీ పడకగదులలో ప్రవేశించక ముందు మూడు సమయములలో మీతో అనుమతి పొందవలెను. ఉదయము ప్రార్థన అనగా నమాజ్‌కు ముందు, మధ్యాహ్నము విశ్రాంతి సమయములో మీరు అధికముగా నున్న బట్టలు తీయునప్పుడు, ఇషా ప్రార్థన తరువాత. ఈ మూడు సమయములు మీ ఏకాంతపు సమయములు. వీటికి తప్ప

అనుమతి లేనిదే రాక పోకలకు మీకు గాని వారికి గాని ఎట్టి పాపము లేదు. మీలో కొందరు కొందరి వద్దకు తరచుగా వచ్చి పోవుచుందురు. ఇటులనే అల్లాహ్ మీ కొరకు సూక్తులను స్పష్టము చేసి వివరించును. అల్లాహ్ సర్వజ్ఞుడు, వివేకవంతుడు.

*(అన్నూర్ 24:59)*

మీలో పిల్లలు యవ్వన దశకు చేరినప్పుడు వారికి పూర్వమున్న వారు అనుమతి పొందినట్లు అనుమతి పొందవలెను. ఇటులనే మీ కొరకు అల్లాహ్ తన సూక్తులను స్పష్టము చేసి వివరించును. అల్లాహ్ సర్వజ్ఞుడు, వివేకవంతుడు.

*(అన్నూర్ 24:60)*

కూర్చొని వున్న వివాహపు ఆశ లేని స్త్రీలు తమ అలంకరణను ప్రదర్శించక అధిక వస్త్రములు ధరించనిచో వారికి ఎట్టి పాపముండదు. వారు జాగరూకులుగా యుండినచో వారి కొరకు ఉత్తమము. అల్లాహ్ శ్రవణ సమర్థుడు, సర్వజ్ఞుడు.

*(అన్నూర్ 24:61)*

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర సతీమణుల కొరకు కొన్ని ప్రత్యేక మార్గదర్శకములు ప్రస్తావించబడెను. వీటిలో ఉత్తమ ప్రవర్తనల పరంగా గొప్ప ఆదర్శములు గలవు. వీటిని ప్రతి విశ్వాస స్త్రీ తప్పక పాటించవలెను.

ఓ సందేశహరుడా! తమ భార్యలతో ఇట్లనుము. మీరు ప్రపంచ జీవితము, దాని అలంకరణ కోరినచో రండు మీకు నేను ధన లాభము కలిగింతును. ఉత్తమముగా మీకు సెలవిత్తును.

మీరు అల్లాహ్‌ను, అతని ప్రవక్తను, పరలోక గృహమును కోరినచో, అల్లాహ్ మీలో నుండి మంచి కర్మలు చేయు వారి కొరకు నిశ్చయముగా చాలా గొప్ప ప్రతి ఫలము సిద్ధపరచి యున్నాడు.

ఓ సందేశహరుని భార్యలారా! మీలో ఎవరేని స్పష్టమైన

దుర్మార్గము నవలంభించినచో ఆమె కొరకు శిక్ష రెట్టింపు చేయబడును. ఇది అల్లాహ్‌కు సులభము.

మీలో ఎవరేని అల్లాహ్, అతని ప్రవక్తకు విధేయురాలై యుండి సత్కర్మలొనరించినచో ఆమెకు మేము దాని ప్రతిఫలము రెండు సార్లు ఇత్తుము. ఆమె కొరకు మేము చాలా గౌరవ ప్రదమైన ఆహారము సిద్ధపరచి వున్నాము. *(అల్ అహ్‌జాబ్ 33:29-32)*

ఓ సందేశహరుని భార్యాలారా! మీరు అల్లాహ్‌కు భయపడినచో మీరు సాధారణ స్త్రీల వలె కానేకారు. కనుక శిగ్గు పడుచు మాటలాడకుము. లేనిచో హృదయములో రుగ్మత గల వ్యక్తి ఆశలో పడును. మంచిగా మాటలాడుము.

తమ గృహములలోనే యుండుము. గడిచిన మూర్ఖత్వ అలంకరణ ను ప్రదర్శించకుము. ప్రార్థన అనగా నమాజ్‌ను స్థిరపరచుము. విధి దానము జకాత్ చెల్లించుము. అల్లాహ్‌కు, అతని ప్రవక్తకు విధేయులై యుండుము. ఓ గృహిణులారా! మీ నుండి ప్రతి మాలిన్యము దూరము చేయవలెనని, మిమ్ములను మంచిగా పవిత్రులుగా చేయవలెనని నిశ్చయముగా అల్లాహ్ గోరివున్నాడు.

మీ గృహములలో చదువబడు అల్లాహ్ సూక్తులను, వివేకమును జ్ఞప్తియందుంచుకొనుము. నిశ్చయముగా అల్లాహ్ సూక్ష్మదర్శనుడు, సర్వజ్ఞుడు. *(అల్ అహ్‌జాబ్ 33:33-35)*

స్త్రీ, పురుషులిరువురు సద్గుణములలో అద్భుత స్థాయికి ఎగబాకవలెనని పై ఆదేశములను పొందుపరచినాము. కావున ఇరువురు ప్రతి స్థితిలో గౌరవము, మర్యాదగా జీవితము గడపవలెను. స్థిరత్వము, నిరాడంబరత, పవిత్రత ఇస్లామీయ సమాజ ప్రత్యేక చిహ్నము. స్త్రీ, పురుషులిరువురు విచ్చలవిడిగా కలియుటను ఇస్లాం నిషేధించెను. తద్వారా స్త్రీలు అన్ని రకాల ఇబ్బందుల నుండి సురక్షితంగా వుండగలరు. అందుకే ఈ క్రింది విధంగా ఆదేశించబడెను.

ఓ సందేశహరుడా! నీవు తమ భార్యలు, తన కూతుళ్ళు విశ్వాస స్త్రీలతో వారు తన దుప్పట్లను తమపై వేసుకొనుమని చెప్పుము. ఇది వారు గుర్తించబడి, వారికి కష్టము కలిగించక యుండుటకు సాధ్యమగును. అల్లాహ్ క్షమాగుణ ప్రపూర్ణుడు, పరమ కారుణ్యమూర్తి.

*(అల్ అహ్జాబ్ 33:60)*

స్త్రీ, పురుషులు విచ్చలవడిగా పరస్పరం స్వతంత్రముగా కలుస్తున్నందున, స్త్రీలు తమను తాము అలంకరించుకొని పురుషులను ఆకర్షించుచున్నందున పాశ్చాత్య దేశములలో నాగరికత నాశనమయ్యెను. నిరాడంబరత, హుందాతనము, సత్ప్రవర్తన వంటి విషయములు కనుమరుగైనవి. ప్రాచీన, నైతిక విలువలను అపహాస్యమునకు గురి చేశారు. పాశ్చాత్య దేశముల ఈ ఆకర్షణలకు గురైన ముస్లిములు ఈ వినాశనకర ఆకర్షణలను ఎదురించలేక విఫలమైరి. ఈ పాశ్చాత్య సమాజ ధోరణిలో దాగి వున్న ప్రమాదాలను త్వరగా గుర్తించి ఇస్లామీ గొప్ప విలువలను పాటించు రోజులు త్వరగా వచ్చునని ఆశించుచున్నాము.

## హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం హదీసులు

హకీమ్ బిన్ముఆవియా రజియల్లాహు తఆలా అన్హు ఇట్లు ఉల్లేఖించిరి. నేను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ఇట్లు ప్రశ్నించితిని. భర్తపై భార్యకు గల హక్కు ఏమిటి? వారిట్లనిరి. నీవు భుజించుచున్నదే ఆమెకు కూడ వడ్డించుము. నీవు ధరించు చున్న వస్త్రములే ఆమెకు అందించుము. ఆమె ముఖము మీద కొట్టకుము. ఆమెను దూషించకుము. గృహములో వున్నప్పుడు తప్ప ఎక్కడా తనను ఆమె నుండి దూరము

చేసుకోకుము. (7)

ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపినట్లు హ్రజత్ అబూహురైరహ్ రజియల్లాహు తఆలా అన్హు ఉల్లేఖించిరి. మీలో సత్ప్రవర్తన గల వ్యక్తులే ఉత్తమ విశ్వాసులు. తమ భార్యలతో గొప్పగా వ్యవహరించు వారే మీలో ఉత్తములు. (8)

ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపినట్లు హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ అమర్ రజియల్లాహు తఆలా అన్హు ఉల్లేఖించిరి. ప్రపంచము ఒక గొప్ప సామాగ్రి. కాని ప్రపంచములోని ఉత్తమ సామాగ్రి ఒక మంచి మహిళ. (9)

హ్రజత్ ఆయిషా రజియల్లాహు తఆలా అన్హా ఇట్లు ఉల్లేఖించిరి. తన ఇద్దరు కుమార్తెలను ఎత్తుకొని యాచించుచు ఒక మహిళ నా వద్దకు వచ్చెను. ఆమెకు దానమివ్వడానికి ఒక ఖర్జూరము తప్ప నా వద్ద ఏమి లేకుండెను. కనుక నేను ఆ ఖర్జూరము ఆమెకు ఇచ్చితిని. ఆమె దానిని రెండు ముక్కలు చేసి తమ కుమార్తెలకు ఇచ్చెను. కాని తను స్వయంగా ఏమియును తినలేదు. అనంతరం ఆమె అక్కడి నుండి లేచి వెళ్ళిపోయెను. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వచ్చినప్పుడు ఆమె ఉదంతమును నేను వారికి తెలియజేసితిని. వారిట్లనిరి. తమ కుమార్తెలను చక్కగా పోషించి వారితో మంచిగా వ్యవహరించిన వారు ప్రతిఫలముగా నరకాగ్ని నుండి రక్షించబడుదురు. (10)

ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపినట్లు హ్రజత్ అబూ షురయ్యహ్ అల్ఖుజయీ రజియల్లాహు తఆలా అన్హు ఉల్లేఖించిరి. బలహీన వర్గములైన ఇద్దరి అనగా అనాథలు, మహిళల హక్కుల సంరక్షణలో ఎలాంటి విఫలమునకు గురైనా నేను అల్లాహ్తో క్షమాపణ కోరుచున్నాను. (11)

ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపినట్లు హ్రజత్ అబూహురైరహ్ రజియల్లాహు తఆలా అన్హు ఉల్లేఖించిరి. మహిళలతో

మృదువుగా వ్యవహరించుము. స్త్రీ పక్కటెముక నుండి పుట్టించబడెను. పక్కటెముకలోని పై భాగము చాలా వంకరగా యుండును. మీరు దానిని నిటారుగా చేయుటకు ప్రయత్నించినచో అది విరిగి పోవును. దానిని మీరు వదిలినచో అది వంకరగానే యుండును. కావున స్త్రీలతో మృదువుగా వ్యవహరించుము. (12)

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపినట్లు హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు తఆలా అన్హు ఉల్లేఖించిరి. ఒక ముస్లిం భర్త ముస్లిం అయిన తన భార్యను ద్వేషించరాదు. ఎందుకనగా ఆమెలోని ఒక విషయము మీకు ఇష్టము లేకున్నచో మీకు ఇష్టమున్న మరో విషయము ఆమెలో మీకు కనిపించును. (13)

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపినట్లు హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు తఆలా అన్హు ఉల్లేఖించిరి. సంభోగము కొరకు భర్త తన భార్యను పిలిచినప్పుడు ఆమె నిరాకరించినచో భర్త ఆమె పట్ల కోపముతో రాత్రిని గడిపినందున దేవదూతలు రాత్రంతా ఆమెను శపించుచుందురు. (14)

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపినట్లు హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు తఆలా అన్హు ఉల్లేఖించిరి. ఎవరినైనా మరొకరికి సష్టాంగము (సజ్దాహ్) చేయుటకు నేను ఆదేశించ దలచినచో భార్య తన భర్త ఎదుట సష్టాంగము (సజ్దాహ్) చేయవలెనని నేను ఆదేశించేవాడిని. (15)

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపినట్లు హజ్రత్ ఉమ్మె సల్మా రజియల్లాహు తఆలా అన్హా ఉల్లేఖించిరి. భార్య మృతి చెందినప్పుడు ఆమె భర్త ఆమెతో సంతోషంగా వున్నచో ఆమె స్వర్గములో ప్రవేశించును. (16)

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపినట్లు హజ్రత్ ఉసామా ఇబ్నె జైద్ రజియల్లాహు తఆలా అన్హు ఉల్లేఖించిరి. పురుషునికి

అత్యంత హానికరమైన వస్తువుగా నేను స్త్రీని వీడి పోవు చున్నాను. (17)

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపినట్లు హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు తఆలా అన్హు ఉల్లేఖించిరి. అల్లాహ్ ప్రీతిని ఆశించుచు నీవు ఖర్చు పెట్టిన దీనారులలో అనగా ఒక బానిసను విడిపించుటకు నీవు ఖర్చు పెట్టిని దీనారు, నిరుపేదల సహాయార్థం నీవు ఖర్చు పెట్టిన దీనారు, నీ భార్యా పిల్లల కొరకు నీవు ఖర్చు పెట్టిన దీనారులో నీవు నీ భార్యా పిల్లల కొరకు ఖర్చు పెట్టిన దీనారు వల్లనే అత్యంత గొప్ప ప్రతిఫలము నొసంగబడును. (18)

హజ్రత్ సాద్ బిన్ అబి వఖ్ఖాస్ రజియల్లాహు తఆలా అన్హు ఒక సుదీర్ఘ హదీసును తెలిపిరి. అందులో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. దైవ ప్రీతిని ఆశించుచు నీవు ఏమియును ఖర్చు చేసినా చివరికి నీ భార్యకు అల్లారు ముద్దుగా ఏమైనా తినిపించినా అల్లాహ్ తఆలా దానికి ప్రతిఫలము నొసంగును. (19)

హజ్రత్ ఆయిషా రజియల్లాహు తఆలా అన్హా ఇట్లు ఉల్లేఖించిరి. ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం భార్యలలో వారి మొదటి భార్య అయిన హజ్రత్ ఖదీజా రజియల్లాహు తఆలా అన్హా కంటే ఎక్కువ మరే భార్యతో నేను ఈర్ష్య పడే దానిని కాదు. వాస్తవానికి నేను ఆమెను ఎన్నడు చూడలేదు. కాని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆమెను తరచుగా జ్ఞాపకము చేసుకునేవారు. ఎప్పుడైనా ఒక మేకపోతును బలిదానమిచ్చినచో వారు దానిని ముక్కలు చేయించి ఆమె స్నేహితురాళ్ళకు పంపించేవారు. హజ్రత్ ఖదీజా వంటి మరే మహిళ లేనట్లు మీరు ఆమెను తరచుగా గుర్తు చేస్తారని కొన్ని సార్లు నేను గునుక్కునే దానిని. అప్పుడు వారిట్లనే వారు. ఆమె గొప్ప గొప్ప సద్గుణములు కలిగి వుండెను. ఆమె ద్వారానే నాకు సంతానము కలిగెను. (20)

# గ్రంథ సూచిక


(1) సునన్ ఇబ్నె మాజ, కితాబున్నికాహ్, బాబ్ మా జాఅ ఫీ ఫజ్లిన్నికాహ్, హదీస్ నం.1846

(2) సహీహుల్ బుఖారి కితాబుద్దావాత్ బాబ్ మా యఖూలు ఇజా అతా అహ్లహు, హదీస్ నం. 6388

(3) సునన్ ఇబ్నె మాజ, కితాబుత్తలాఖ్, బాబ్ హద్ధసనా సువైదుబ్ను సయీదిన్ హదీస్ నం. 2018

(4) సుననుత్తిర్మిజి అబ్వాబుల్ మనాఖిబ్, బాబ్ ఫజ్లి అజ్వాజిన్నబి హదీస్ నం. 3895

(5) కన్జుల్ ఉమ్మాల్ సంపుటి 8 భాగము 16 పుట 192 కితాబున్నికాహ్ ఖిస్ముల్ అఖ్వాలిల్ బాబుత్తహ్మీను ఫీ బిర్రిల్ వాలిదైని హదీస్ నం. 45431

(6) సునన్ అబీ దావూద్ అబ్వాబున్నౌమ్, బాబ్ ఫీ ఫజ్లి మన్ అలా యతామా హదీస్ నం. 5146/
ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 4 పుట 403 ముస్నద్ అనసుబ్ని మాలికిన్ హదీస్ నం.12621

(7) సునన్ అబీ దావూద్, కితాబున్నికాహ్ బాబ్ ఫీ హఖ్ఖిల్ మర్అతి అలా జౌజిహా, హదీస్ నం. 2142

(8) సుననుత్తిర్మిజి అబ్వాబు ర్రిదా బాబ్ మా జాఅ ఫీ హఖ్ఖిల్ మర్అతి అలా జౌజిహా, హదీస్ నం. 1162

(9) సహీహుల్ ముస్లిం, కితాబుర్రిదా, బాబ్ ఖైరు మాతాయిద్దున్యా అలా మర్అతుస్సాలిహా, హదీస్ నం. 3643

(10) సహీహుల్ బుఖారి కితాబుజ్జిక్ర్ బాబ్ ఇత్తఖున్నార వలౌ బిశిఖ్ఖి తమ్రతిన్ వల్ ఖలీలి మినస్సదఖహ్ హదీస్ నం. 1418
సహీహుల్ ముస్లిం కితాబు బిర్రి వస్సలాతి వల్ఆదాబి బాబ్ ఫజ్లిల్ ఇహ్సాని ఇలల్ బనాతి, హదీస్ నం. 6693

(11) సుననుల్ కుబ్రా లిన్నిసాయి సంపుటి 5 పుట 363 కితాబ్ ఇష్రతిన్నిసా బాబ్ మా జాఅ ఫీ హఖ్ఖిల్ మర్అతి అలా జౌజిహా,

హదీస్ నం. 9150

(12) సహీహుల్ బుఖారి కితాబ్ అహాదీసుల్ అన్బియా బాబ్ ఖల్కి ఆదమ్ వజుర్రియాతిహి, హదీస్ నం. 3331
సహీహుల్ ముస్లిం, కితాబుర్రిదా, బాబ్ వసియ్యతి బిన్నిసాయి,

(13) సహీహుల్ ముస్లిం, కితాబుర్రిదా, బాబ్ వసియ్యతి బిన్నిసాయి, హదీస్ నం. 3648

(14) సహీహుల్ బుఖారి కితాబున్నికాహ్, బాబ్ ఇద్దతు మతాఅతిల్ మర్అతి ముహాజిరతన్, ఫిరాష జౌజిహా, హదీస్ నం. 5193

(15) సునన్ అత్తిర్మిజి, అబ్వాబుర్రిదా, బాబ్ మాజాఅ ఫీ హఖ్ఖిజ్జౌజి అలల్ మర్అతి, హదీస్ నం. 1159

(16) సునన్ అత్తిర్మిజి, అబ్వాబుర్రిదా, బాబ్ మాజాఅ ఫీ హఖ్ఖిజ్జౌజి అలల్ మర్అతి, హదీస్ నం. 1161

(17) సహీహుల్ బుఖారి కితాబున్నికాహ్, బాబ్ మా యత్తఖ మిన్ సౌమిల్ మర్అతి, హదీస్ నం. 5096
సహీహుల్ ముస్లిం, కితాబుర్రిఖాఖ్, బాబ్ అఖ్తురు అహ్లిల్ జన్నతిల్ ఫుఖరావు, వఅఖ్తురు అహ్లిన్నారిన్నిసా,

(18) సహీహుల్ ముస్లిం, కితాబుజ్జకాత్, బాబ్ ఫజ్లిన్నఫఖతి అలల్ ఇయాలి వల్మలూకు వల్ఇత్మి మినద్దయాహుమ్ ఔ అబస నఫఖతుహుమ్ అన్‌హుమ్ హదీస్ నం. 2311

(19) సహీహుల్ బుఖారి కితాబుల్ఈమాన్ బాబ్ మా జాఅ అన్నల్ అమాల బినియ్యతి వల్హిస్బతి, హదీస్ నం. 56
సహీహుల్ ముస్లిం కితాబుల్ వసియ్యహ్ బాబుల్ వసియ్యతి బిత్థులూతి, హదీస్ నం. 4209

(20) సహీహుల్ బుఖారి కితాబుల్ మనాఖిబిల్ అన్సార్, బాబ్ తజ్వీజిన్నబియ్యి ఖదీజత వ ఫదీహా, హదీస్ నం. 3818
సహీహుల్ ముస్లిం కితాబ్ ఫజ్లిస్సహాబహ్, మిన్ ఫజాయిలి ఖదీజత ఉమ్ముల్ మొమినీన్, హదీస్ నం. 6277